నిరసన సభలో మాట్లాడుతున్న కేటీఆర్, వేదికపై ఎమ్మెల్యేలు అనిల్ జాదవ్, కోవ లక్ష్మి, పాడి కౌశిక్‌రెడ్డి, సంజయ్, మాజీ ఎమ్మెల్యేలు జోగు రామన్న, బాల్కసుమన్, చిన్నయ్య, ఖానాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రాంలీలా మైదానంలో నిర్వహించిన నిరసన సభకు తరలివచ్చిన అశేషజనవాహిని

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రాంలీలా మైదానంలో నిర్వహించిన నిరసన సభకు తరలివచ్చిన అశేషజనం, రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు

జైకేసీఆర్.. జైజైకేటీఆర్.. జైజైజై తెలంగాణ నినాదాలు చేస్తున్న వృద్ధ మహిళ, రైతు

ఆదిలాబాద్ నిరసన సభ కొట్లాటకు తోవచూపింది..

రైతు, ప్రజా సమస్యలపై ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఆందోళనలు

- ఆదిలాబాద్ సీసీఐ, దేవాపూర్ సిమెంటు పరిశ్రమ, సింగరేణిపై అదానీ కన్ను
- రుణమాఫీ అడిగితే కేసులా? హామీలు అమలు చేయని లుచ్చాలపై కేసులు పెట్టాలి..
- కేసులకు భయపడేది లేదు.. ప్రజల కోసం జైలుకుపోతాం..
- ఆదిలాబాద్ రైతు నిరసన సభలో గర్జించిన యువనేత కేటీఆర్

ఆదిలాబాద్, అక్టోబర్ 24(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలో నిర్వహించిన రైతు నిరసన సభ రాష్ట్రంలోని రైతు, ప్రజా సమస్యలపై కొట్లాడడానికి తోవ చూపిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రాంలీలా మైదానంలో నిర్వహించిన రూ.2 లక్షల రుణమాఫీ, రైతుభరోసా, ఆరు గ్యారెంటీలు అమలు చేయాలని బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన సభకు యువనేత కేటీఆర్ హాజరై ప్రసంగించారు. తెలంగాణ ఉద్యమంలో ఆదిలాబాద్ జిల్లా అగ్రభాగాన నిలిచిందని, భోరజ్ చెక్‌పోస్టు వద్ద నిర్వహించిన సడక్‌రోకో కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వంటావార్పు కార్యక్రమానికి తాను హాజరైనట్లు వివరించారు. కాంగ్రెస్, బీజేపీలు తోడుదొంగలని, రాష్ట్రంలోని పరిశ్రమలను అదానీకి కట్టబెట్టాలని చూస్తున్నాయని మండిపడ్డారు. నల్గొండ జిల్లా రామన్నపేటలో అదానీ సిమెంట్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా ర్యాలీ తీసి కాలుష్య పరిశ్రమను వ్యతిరేకించినట్లు తెలిపారు. ఆదిలాబాద్ సిమెంట్ పరిశ్రమ, బెల్లంపల్లిలోని దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ ఫ్యాక్టరీ, సింగరేణిపై అదానీ కన్ను పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. గులాబీ కండువా గట్టిగలేకపోతే కాంగ్రెస్, బీజేపీ మోసం చేస్తాయని పేర్కొన్నారు. ఆదిలాబాద్ సీసీఐని ప్రారంభిస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా హామీ ఇచ్చారని, గతంలో గెలిచిన ఎంపీతోపాటు ప్రస్తుత ఎంపీ, ఎమ్మెల్యేలు సీసీఐ పేరు చెప్పి గెలిచిన తర్వాత మాట మార్చారన్నారు.

ఉమ్మడి జిల్లావ్యాపంగా ఆందోళనలు

రైతు సమస్యలపై ఆదిలాబాద్ నియోజకవర్గంలో నిర్వహించిన విధంగా.. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా బీఆర్ఎస్ నాయకులు ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. మాజీ మంత్రి జోగు రామన్న రైతులు, ప్రజా సమస్యలపై ఇలా మాట్లాడడం తాను ఇప్పటివరకు చూడలేదన్నారు. ఇచ్చోడ మండలంలోని ముక్రా(కే)లో రైతులు, ప్రజలు తమకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని పోస్టుకార్డు ఉద్యమం చేపట్టినట్లు తెలిపారు. హామీలు అమలు చేయాలని కోరుతూ రాహుల్‌గాంధీకి ఉత్తరాలు రాశారన్నారు. నవంబరులో మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయని, జిల్లా ప్రజలు అక్కడ ఉన్న తమ బంధువులకు తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ చేసిన మోసాలను తెలియజేయాలని కోరారు.

రైతులు, పేదలపై కేసులా?

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన రూ.2 లక్షల రుణమాఫీ కోసం తలమడుగు మండలంలోని రుయ్యాడిలో ఆందోళన చేసిన రైతులపై కేసులు పెడితే హామీలు అమలు చేయని లుచ్చాలపై కూడా కేసులు పెట్టి జైలుకు పంపాలని యువనేత కేటీఆర్ డిమాండ్ చేశారు. హైడ్రా తరహాలో ఆదిలాబాద్ పట్టణంలోని ఖానాపూర్‌లో ఇండ్లను కూలగొట్టడానికి అధికారులు పోతే కడుపుమంటతో మాట్లాడిన బొడిగం గంగన్న అనే వృద్ధునిపై కేసు పెట్టారని తెలిపారు. ప్రజలు తమకు కొట్లాడే శక్తిని ఇవ్వాలని ప్రజా సమస్యల కోసం తాము జైలుకు పోవడానికి కూడా సిద్ధంగా ఉన్నామన్నారు. ఆదిలాబాద్‌లో రైతులు పండించిన పత్తికి సీసీఐ ద్వారా కొనుగోలు చేసి గుజరాత్ ఇస్తున్న ధర క్వింటాలుకు రూ.8,800 చెల్లించాలని డిమాండ్ చేశారు. పత్తికి ఆ ధర చెల్లించేలా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పంట కొనుగోలు కేంద్రాలకు పోయి అధికారులను నిలదీయాలని సూచించారు. పత్తి కొనుగోలు విషయంలో బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యేలు కొట్లాడలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అనిల్ జాదవ్, కోవ లక్ష్మి, సంజయ్, కౌశిక్‌రెడ్డి, మాజీ జడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్, యూనిస్ అక్బానీ, సాజిదొద్దీన్, రోకండ్ల రమేశ్, నర్సింగరావు, విజ్జిగిరి నారాయణ, అజయ్, లింగారెడ్డి పాల్గొన్నారు.



కేటీఆర్, రామన్నలను పూలమాలతో సన్మానిస్తున్న స్థానిక నాయకులు

కేటీఆర్‌తో కరచాలనం చేసేందుకు పోటీ పడుతున్న రైతులు, ప్రజలు

❖ రైతులను మోసం చేసిన రేవంత్..



తాంసి, అక్టోబర్ 24 : రాష్ట్ర రైతాంగంతోపాటు నిరుపేదలను మోసం చేసిన ఘనత ఈ బట్టేబాజ్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికే దక్కుతుంది. ఎన్నికలకు ముందు రేవంత్ రెడ్డి ఎంబడే రూ.2 లక్షలు బ్యాంకుకు వెళ్లి రుణం తీసుకోవాలని చెప్పి మాఫీ చేయకుండా మోసం చేసిండు. రైతు భరోసా కూడా ఎగ్గొట్టిండు. పార్లమెంట్ ఎన్నికల్లో ఓడిపోతామని అప్పటికప్పుడు రైతుల ఖాతాలో కేసీఆర్ పైసలు వేసిన సర్కారుకు ఇప్పుడు రైతుల ఖాతాలు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. వ్యవసాయశాఖ మంత్రి, సీఎం ఇద్దరు 420 దొంగలని, వెంటనే రైతుల ఖాతాలో రైతుభరోసా, రుణమాఫీ జమ చేయాలని కోరారు. ఆదిలాబాద్ బహిరంగ సభలో రాహుల్‌గాంధీ రాజ్యాంగం మీద ఒట్టేసి ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత చేస్తానని ఇచ్చి హామీ ఉత్తదయిందని మండిపడ్డారు. ఆదిలాబాద్ జిల్లాను దత్తత తీసుకుంటానని రేవంత్‌రెడ్డి మాట ఇచ్చి మోసం చేశాడని పేర్కొన్నాడు. **- జోగు రామన్న, మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు**

❖ రేవంత్ ఢిల్లీకా.. తెలంగాణకా సీఎం..

తాంసి, అక్టోబర్ 24 : తెలంగాణ ప్రజలకు అబద్ధపు హామీలు, మాయమాటలు చెప్పి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి గద్దెనెక్కారు. ఆ తర్వాత మాటి మాటికి ఢిల్లీకే పయనం అవుతున్నారు. రేవంత్ ఢిల్లీకి ముఖ్యమంత్రా? తెలంగాణకు ముఖ్యమంత్రా? అనేది అర్థం కావడం లేదని మండిపడ్డారు. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేస్తుంటే.. తులం బంగారం ఎప్పుడిస్తారని లబ్ధిదారులు అడుగుతున్నారని గుర్తు చేశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో జూన్, నవంబర్ నెలల్లో గలగల రైతుబంధు పైసలు పడుతుంటే.. కాంగ్రెస్ పాలనలో పంట కాలం ముగిసినా రైతుభరోసా పడడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. నిండా మునిచిన కాంగ్రెస్‌కు రానున్న ఎన్నికల్లో రైతులే బుద్ధి చెబుతారని హితువు పలికారు. **- అనిల్ జాదవ్, ఎమ్మెల్యే, బోథ్**

❖ కేసీఆర్ సారుతోనే మేలు

మాది నిరుపేద కుటుంబం. ముసలోళ్లమైనా రోజూ కూలీ పనులకు పోతున్నం. మాలాంటోళ్లకు మేలు చేస్తరని గీ కాంగ్రెసోళ్లను నమ్మినం. నమ్మిన పాపానికి మోసం చేసిన్రు. మాకు ఎలాంటి మేలు జరగడం లేదు. గందుకే గీ సభల మా బాధలు చెప్పుకుందామని వచ్చినం. మళ్లా కేసీఆర్ సార్ రాజ్యం వస్తేనే రైతులు, కూలీలకు మేలు జరుగుతుంది.

- తాక్సాండే ఆనందరావు, విశ్రాంతబాయి, కూలీలు, పిప్పల్‌ధరి, ఆదిలాబాద్ మండలం

❖ కేటీఆర్ మాటలతో ధైర్యం వచ్చింది..

నేను ఈ రోజు ఆదిలాబాద్‌లో జరిగిన రైతు పోరుబాట సభకు వచ్చా. కేటీఆర్ సార్ మాటలతో నాకే కాదు రైతులందరికీ ధైర్యం వచ్చింది. మాకున్న ఐదెకరాల భూమికి కేసీఆర్ సార్ సీఎంగా ఉన్నప్పుడు రైతుబంధు వచ్చేది. ఇప్పుడా డబ్బుల జాడ లేదు. రైతుబంధు రాక, రుణమాఫీ లేక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నా. అందుకే పనులు వాయిదా వేసుకుని ఆదిలాబాద్ సభకు వచ్చా. ఏ కష్టం రాకుండా చూసుకున్న బీఆర్ఎస్ సర్కారే మళ్లీ వస్తుందని నేను బలంగా నమ్ముతున్నా.

- రడారపు శంకరయ్య, రైతు, ధనోరా, భీంపూర్

❖ కేసీఆర్ పాలనే బాగుండె..

కేసీఆర్ పాలనలో రైతుల బతుకులు మస్తు మంచిగుండె. అన్ని పథకాలు తీసుకొచ్చి మేలు చేసిండు. గీ కాంగ్రెస్ వచ్చేడేమోగాని మా బతుకులు ఆగమైనయి. రైతులకిచ్చిన హామీలేవీ నెరవేర్చడం లేదు. మస్తు తిప్పల పెడుతున్నరు. కేటీఆర్ సభ ఉందని తెల్వగానే అందరం కలిసి వచ్చినం. మా ఆదివాసీ రైతులు, మహిళలకు న్యాయం జరగాలంటే మళ్లా బీఆర్ఎస్ సర్కారే రావాలే. **- కుమ్ర జంగూబాయి, మహిళా రైతు, ఆదిలాబాద్ మండలం**

తెలంగాణపై ప్రధాని మోదీ వివక్ష

- గుజరాత్ తరహాలో తెలంగాణ పత్తికి మద్దతు ధర ఇవ్వాలి
- రైతాంగ సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాడుతాం..
- గ్రామస్థాయి నుంచి పార్టీని పునర్‌నిర్మిస్తాం..
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

నిర్మల్, అక్టోబర్ 24(నమస్తే తెలంగాణ) : తెలంగాణ రాష్ట్రం నుంచి ఎనిమిది మంది బీజేపీ ఎంపీలను గెలిపిస్తే ప్రధాని మోదీ మాత్రం ఈ ప్రాంతంపై వివక్ష చూపుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. ప్రధాని సొంత రాష్ట్రమైన గుజరాత్‌లో క్వింటాలు పత్తికి రూ.8,800 మద్దతు ధర చెల్లిస్తుంటే.. తెలంగాణలో మాత్రం కేవలం రూ.7 వేల పైచిలుకు మద్దతు ధర మాత్రమే ఇస్తున్నారన్నారు. ఇది ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు. గురువారం ఆదిలాబాద్ పర్యటన ముగించుకుని తిరుగు ప్రయాణంలో నిర్మల్‌లోని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రాంకిషన్‌రెడ్డి నివాసంలో కాసేపు ఆగారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణులతో భేటీ అయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల్లో ఇక్కడి రైతులు పెద్ద ఎత్తున పత్తి పంటను సాగు చేస్తారని, ప్రస్తుతం పంట చేతికొచ్చినప్పటికీ సీసీఐ సంస్థ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులంతా ఆందోళనలో ఉన్నారన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఏ ఒక్క రైతుకు అన్యాయం జరిగినా నిర్మల్ ఎమ్మెల్యే, బీజేపీ శాసన సభాపక్ష నేత మహేశ్వర్‌రెడ్డితోపాటు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఉన్న నలుగురు బీజేపీ ఎమ్మెల్యేలు, ఆదిలాబాద్ పార్లమెంటు సభ్యులు నగేశ్‌లే పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఎనిమిది మంది ఎంపీలతోపాటు ఎమ్మెల్యేలందరు ఢిల్లీకి వెళ్లి గెలిపించిన ప్రజలకు న్యాయం చేయాలని సూచించారు. ఈ విషయంలో బీజేపీ నాయకులు పట్టించుకోకపోతే రైతుల పక్షాన బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ గెలిస్తే రైతుబంధుకు రాంరాం అంటదని ఎన్నికలప్పుడు కేసీఆర్ చెప్పారని, నిజంగానే ఇప్పుడు రాష్ట్రంలో అదే జరుగుతున్నదన్నారు. రాష్ట్ర రైతాంగానికి ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చేవరకు ఈ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వదిలిపెట్టమని, రైతులెవరూ బాధపడాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. రైతాంగ సమస్యలపై కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్‌ను నిలదీస్తూ రైతుల పక్షాన పోరాడాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

ఇథనాల్ పరిశ్రమపై త్వరలోనే కార్యాచరణ

దిలావర్‌పూర్ మండలంలో నిర్మిస్తున్న ఇథనాల్ పరిశ్రమను నిలిపివేయాలని స్థానికంగా వస్తున్న డిమాండ్‌ను పరిశీలించి, త్వరలోనే బీఆర్ఎస్ తరపున నిరసనలకు కార్యాచరణ రూపొందిస్తామని కేటీఆర్ హామీ ఇచ్చారు. తమ ప్రభుత్వ హయాంలో ఇథనాల్ పరిశ్రమను జనావాసాలకు దూరంగా ఏర్పాటు చేయాలనుకున్నామని, కానీ.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత పరిశ్రమ స్థలాన్ని మార్చినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పరిశ్రమను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ప్రాంతానికి చెందిన కొందరు నాయకులు పదేళ్లపాటు పదవులను అనుభవించి తమ స్వార్థ ప్రయోజనాల కోసం, ఆస్తులను కాపాడుకునేందుకు పార్టీని వీడారని.. అలాంటి వారికి రాబోయే రోజుల్లో ప్రజలే గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. నిబద్ధత కలిగిన నాయకులు, కార్యకర్తలు కేసీఆర్ వెంట ఉన్నారని, కొంత మంది నాయకులు పార్టీని వీడినంత మాత్రాన నష్టమేమి ఉండదన్నారు. కొత్త నాయకులు తయారవుతారని, వారి నాయకత్వంలోనే రాబోయే రోజుల్లో ప్రజల పక్షాన నిలబడి అన్ని కార్యక్రమాలు చేస్తామని తెలిపారు. ఇప్పటికే అన్ని వర్గాల ప్రజల్లో కాంగ్రెస్‌పై వ్యతిరేకత స్పష్టంగా కనిపిస్తున్నదని, కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడే బాగుండే.. కాంగ్రెస్ వచ్చిన తర్వాత ఇబ్బందులు పడుతున్నామని చాలా చోట్ల ప్రజలు చర్చించుకుంటున్నారన్నారు. పార్టీని గ్రామస్థాయి నుండి పునర్నిర్మాణం చేస్తామని, 2028లో జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో గులాబీ జెండాను ఎగురవేస్తామని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అనిల్ జాదవ్, పాడి కౌశిక్‌రెడ్డి, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ విజయలక్ష్మీ, నాయకులు రాంకిషన్‌రెడ్డి, భుక్యా జాన్సన్ నాయక్, రమాదేవి, లోలం శ్యాంసుందర్, సుభాష్‌రావు పాల్గొన్నారు.